# "ఆడ పిల్ల పుడితే..."

శా ర్వా ణి

మెటర్నిటీ హాస్పిటలు చివర గదితలుపులు దగ్గరగా వేసి వున్నాయి. గది గుమ్మానికి వ్రేలాడుతున్న కర్టను తలుపు సందుల్లో ఇరుక్కుపోయింది. ఆ గది ముందు వెంకటాద్రితప్ప ఎవరూ కనిపించినట్లులేదు. అటూ ఇటూ పచార్లుచేస్తున్న వెంకటాద్రి, అకస్మాత్తుగా ఆగి గుమ్మం వంక చూస్తున్నాడు.

"ఆడపిల్ల" ఎక్కణ్ణుంచి వినిపిస్తోందోగాని ఆమాట అతనికి తప్ప ఎవరికి విన్పించలేదు.

ముఖం నిండా ముచ్చెమటలు పోశాయి. గుండెల్లో దడ ప్రారంభమైంది. కాళ్ళమీద నిలబడే సత్తువకూడ దిగజారిపోయింది. నిలబడలేక అక్కడున్న బల్లమీద చతికిలబడ్డాడు.

"ఈసారి కూడా ఆడపిల్ల తప్పదా?" ఎవరికి చెప్పడంలేదు. అతన్ని అతడే అడుగుకున్నాడు. సమాధానం రాలేదు. గుండెలో దడ తగ్గలేదు. చెమట ఇంకా పడుతూనే ఉంది. కమీజు సగం తడిసిపోయింది. రెండు దమ్ములు లాగితే, కొంత 'రిలీఫ్' ఉంటుందని జేబులో తడిమి చూశాడు. నలిగి, ముడతలు పడిపోయి, సగం విరిగిపోయిన సిగరెట్టు ముక్క బయటకువచ్చింది.

ప్రక్కగదిలో పిల్లవాడు కేరు మంటున్నాడు. సిగరెట్టు ముక్క కాలిక్రింద నలిగిపోయింది. కళ్ల గది తలుపులు వంక నిలిచి చూస్తున్నాయి.

"మళ్ళా ఆడ పిల్ల పుట్టదు కదా?"

"ఆడపిల్ల" ఈ శబ్దం వినిపిస్తే చాలు.... అమ్మ బాబోయ్! గుండె పగిలిపోతుంది. మొట్టమొదటసారే ఆడపిల్లను పుట్టించవద్దని, ఎన్ని దేవుళ్ళకు దరఖాస్తులు పెట్టుకున్నా ప్రయోజనం సున్న. మాచవరం ఆంజనేయ స్వామికి పాతిక టెంకాయలు, చిలకలపూడి పాండు రంగనకు నవటాకు పటికబెల్లము, మంగళగిరి పానకాల దేవుడికి ముప్పాతి బిందె పానకం, చిన్న తిరుపతి వెంకటేశ్వర్లుకి నెత్తిమీద వెండ్రుకలు అర్పించుకున్నా ఆ నల్గురి దేవుళ్ళలో ఒక్క దేవునికికూడ కనికరం రాలేదు. పాపాలు చేయకపోయినా తెలియక ఏమైనా చేస్తున్నామని భయపడి తాహతుకొలది, హృదయపూర్వకంగా మగపిల్లవాడి కోసం అంజలి మోడ్చి, అర్థిస్తే ప్రతిఫలం "ఆడపిల్ల" ఏం చేయాలి?"

నేను గుమాస్తా అని, నెల జీతం మూడు పాతికలకు మించి రాదని, భగవంతునికి తెలుసుండీకూడా నాకెందుకీ శిక్ష? ఆపద్బాంధవుడని, దీనజనరక్షకుడని భగవంతుణ్ణి అంటారే, అవి ఒకటీ కూడా నిజమైనవికావా? ఎక్కడున్నావయ్యా పరమాత్మా! అంతా వట్టిది ... అసలు దేవుడులేడు. ఉంటే ఎందుకీ కష్టాలు. కోరినవి జరగక పోవడం ... అందుకే కామోసు దేవుడు లేడంటారు పరీక్ష తప్పిన కొందరు కుర్రాళ్ళు. ? ధైర్యంచేసి నా నోటినుంచి ఈ మాటవస్తే, ఏ గోడ ప్రక్కనుంచైనా మా ఆవిడ వింటే ఇంకేమైనా వుందా? కొంపలు అంటుకోవ్! దేవుడు పెట్టకపోయినా, దేవుని తరపున శాపనాకారాలు మా ఆవిడ పెట్టేస్తుంది.

భార్య మాటలు జ్ఞాపకానికి వచ్చాయి. ఒకసారి ఆంజనేయ దండకం చదువుకున్నాడు వెంకటాద్రి.

"దేవుడు లేడనకండి. ఉన్నాడు. ఇందుగల డందు లేడని సందేహము వలదు. ఎందుచూచిన ఉంటాడు. కన్పించడు అంతే."

ఈసారి మొగపిల్లవాడు దక్కితే, వడ్డికాసులవాడికి లునివు దోపిడి ఇస్తాను" మనస్సులో మొక్కుకున్నాడు. భార్య వంటిమీద మంగళసూత్రం తప్ప, మరేమీలేదన్న సంగతి మరచిపోయాడు.

ఎందు కింత చాదస్తం? మొగపిల్లవాడు కల్గినా, ఆడపిల్ల పుట్టినా, ఏదైనా మనిషి జన్మేగా? అతనికి వళ్ళు ఝల్లుమంది. మళ్ళా గుండెల్లో దడ ప్రారంభం.

నిజమే. కొన్ని సంవత్సరాల క్రితం, మొగవాళ్ళు ఆడపిల్లలను కొనుక్కొని పెళ్ళిళ్ళు చేసుకొనేవారు. దాన్ని కన్యాశుల్కం అంటారు. ఆడబ్బు పిల్ల తండ్రికి దక్కేది. ఇప్పుడు కాలం తీరు మారింది. ఆడపిల్లలే మగవాళ్ళను కొనుక్కుంటున్నారు. ప్రస్తుతం మార్కెట్టులో దాని విలువ విపరీతంగా పెరిగిపోతోంది. ఆడపిల్లల జనభా అధికమవుటవల్ల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని దరిమిలా పిల్లల తండ్రులు తెలుసుకున్నారు.

ఒకరోజు వెంకటాద్రి ప్రక్క ఇంట్లో ఉంటున్న శేషమనాయుడు కూతుర్ని చూసుకోడానికి పెండ్లివారు వచ్చినప్పుడు అతడు అక్కడే వున్నాడు.

"అమ్మాయి అందంగానే వుంది. చదువుకుంది. సంగీతం వచ్చును. అన్నీ ఉన్నాయి. కాని..."

"అబ్బాయి విషయం బాగా తెలుసుగదా! కనీసం రెండు వేలైనా ఇప్పించాలి"

"ఇంకా ఇద్దరి పిల్లలకు పెళ్ళిళ్ళు చేయాలి. వెనక ఆస్తి పాస్తులు లేనివాణ్ణి. మీరింత ఇదిగా నిర్ణయిస్తే, ఇద్దరి పిల్లల భవిష్యత్తు, నా జీవితం గురించి ఆలోచించారా?" ప్రాధేయపడ్డాడు పిల్లల తండ్రి. వెంకటాద్రికి కళ్ళవెంట నీళ్ళు వచ్చే పర్యంతం అయింది.

"క్షమించాలి. ఈ వ్యవహారంలో చిల్లికాని తగ్గలేను. బాధపడుతున్నావని, ఆడపిల్లల తండ్రివని అక్కడికీ 500 రు॥లు తగ్గించాను. మరొక్కసారి చెబుతున్నా. మీపరిస్థితులను సుదీర్ఘంగా ఆలోచించే ఆ నిర్ణయానికి వచ్చింది."

అచ్చట ఏదైనా ఉంటే, ఎత్తి అమాంతంగా నెత్తి మీద బాదుదామన్నంత కోపం వచ్చింది వెంకటాద్రికి.

"స్కూలు ఫైనల్ గజినీ దండయాత్రలు కొడుతున్న ఆ పక్షిగాడికి రెండువేలట. వాడబ్బ సొమ్ము దాచిపెట్టి వుంచాము వాడికర్పించడానికి. ఆకొరివి దెయ్యానికి వేలు కావాలట వేలు" వెంకటాద్రి కారోజు మనస్సులో మరుగుతున్న మాటలు పొంగకుండా లోపలే కుతకుత లాడాయి. శబ్దం ఎవరికీ వినిపించలేదు. అతనికి ఆడపిల్ల పుట్టిన తర్వాత ఆ చప్పుడు మరీ ధ్వనించింది.

శేషమనాయుడు కూతురి కింకా పెళ్ళికాలేదు. మిగిలిన ఇద్దరు పిల్లలు పెళ్ళికి ఎదిగివున్నారు. పెద్దదానికి 25 సం॥లు నిండాయి.

పిల్లల తండ్రి తాను బ్రతికుండగా పిల్లల పెళ్ళిళ్ళు చేయలే"నని కుమిలి కుమిలి వెంకటాద్రి ముందు ఏడ్చేవాడు, వెంకటాద్రి అధైర్యానికి అది నాంది.

వరకట్నాలు ఎన్నో జీవితాలను నాశం చేస్తున్నాయి. సామాన్య కుటుంబ జీవితాలను హతమారుస్తున్నాయి.

మీరంతా ఏంచేస్తున్నారు? వెంకటాద్రి హృదయ గోళంలో పెద్ద కేకలు మారుమ్రోగాయి.

అందుకే స్కూలుఫైనలు పాసయిన మేధావికి మూడు వేలు. ఇంటర్మీడియట్ అనిపించుకున్న ప్రబుద్ధుడికి నాల్గువేలు, బి.ఏ. పట్టా పట్టుకున్న అవతార పురుషునకు ఐదు వేలు. వారెవ్వా! బావున్నాయి. బ్రహ్మాండంగా వున్నాయి. భారతదేశ భావి పౌరుల ఆశయాలు. మాచక్కగావున్నాయి. దేశకల్యాణం కోసం పాటు పడుతున్నామనే ధీరుల ఆదర్శాలు.

"అయితే పెద్దమ్మాయి పెళ్ళయినట్లే" నిస్పృహ జెందాడు.

చాలా జాగ్రత్తగా ఉండాలి. ఆడపిల్ల తండ్రిని ఇప్పట్నుంచీ ఒకపూట పస్తుండైనా కొంత డబ్బు నిల్వ చేయాలి. తన జీవిత సౌఖ్యం కోసం కాదు. పుట్టిన ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయడం కోసం. మొదటి పిల్ల జన్మించిన తర్వాత ప్రావిడెంటు ఫండు నాల్గు రూ॥లు నుంచి ఎనిమిది రూ॥లకు పెంచవలసివచ్చింది. 75 రూ॥లలో 8 రూ॥లు పోతే 67 రూ॥లు. తల్లి, పెళ్లాం, పిల్ల, తనూ, ఇంత సంసారం బ్రతకాలి. జీతంలో మూడోవంతు ఇంటి అద్దెకే పోతుంది. బట్టలు కుట్టించుకోవడానికి కానీ మిగలదు. ఒక్కొక్కళ్ళకి ఒకే ఒక్క జత. దానితో కాలక్షేపం.... డబ్బుచాలదు. ప్రాణం పోదు. బ్రతకాలి. ఇంటిల్లిపాదీ జీవించాలి. మానవ జన్మ "మహత్తర జన్మ" గుడిలో గంటలు మ్రోగుతున్నాయి. ఆడపిల్లల తండ్రులకు మతులు పోతున్నాయి.

పెళ్ళెందుకు చేసుకున్నాను? పెళ్ళి వద్దు మొర్రో అంటే, అమ్మ వినలేదు. అమ్మ చస్తానని కూర్చుంది.

తప్పలేదు. పెళ్ళయిపోయింది. కష్టాలకు ప్రారంభోత్సవం జరిగింది. మా పెద్దమ్మాయే ప్రారంభోత్సవం చేసింది.

కట్నం విషయంలో అనర్గళంగా గుక్క తిప్పకుండా, గంటలు తరబడి లెక్చర్ దంచేస్తున్న జడ్జిగారి అబ్బాయి వినిపించుకుంటాడా? ఇప్పుడు కనిపిస్తే నిలదీసి అడిగే వాణ్ణి. "మీరు కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటారా?" ఒక పిల్ల తండ్రి అడిగాడు ఆశానిరాశల మధ్య నిలబడి.

"కట్నం లేకుండా ఆదర్శంగా పెళ్ళి చేసికొనుటయే నా జీవిత లక్ష్యం" హాలు పైకప్పులు ఎగిరిపోయేటట్లు చప్పట్లు వినిపించాయి వెంకటాద్రికి, ఉలిక్కి పడ్డాడు.

ఎందు కిట్లాగ అయిపోతున్నాను? అమ్మాయికి పెళ్ళి అవదని భయమా? ఆమ్మాయి పెళ్ళీడికి వచ్చే సరికి రోజులు మారవచ్చును. ఈలోపులో వర కట్నాల బిల్లు అమలులోనికి వస్తుంది. వచ్చినా ప్రయోజనం ఏముంటుంది? "పొగ త్రాగరాదు, దొంగలున్నారు జాగ్రత్త, లంచాలు తీసికొనకూడదు, మద్యపాన నిషేధం"

రేపు వరకట్నాలబిల్లు అమలులోనికివస్తే, ఉపయోగం పర్యవసానం చెప్పలేం? అసలు బిల్లు వస్తుందనే నమ్మకం ఎక్కడుంది?

తలుపులు తెరచిన శబ్దం. వెంకటాద్రి త్రుళ్ళిపడ్డాడు. నర్సు తలుపులు తీసి బయటకు వచ్చింది. అతడు ఏదో అనబోయాడు. మాటలు పెదవులుదాటి రాలేకపోయాయి. నర్సు తలుపులు దగ్గరగా వేసి తిరిగి వెళ్ళిపోయింది.

నర్సు నవ్వింది. మగపిల్లవాడు పుట్టే సూచనలు, జోస్యం కూడా నిజమవుతుంది. ఈసారి మగపిల్లవాడని అందరూ అంటున్నారు. ఆఫీసులో అడ్వాన్సుగా టీపార్టీ చేయించుకున్నారు. తప్పదు. మగపిల్లవాడే.... ముమ్మాటికీ... మగపిల్లవాడే....

బాధలన్నీ తొలగిపోతాయి. చిక్కులన్నీ విడిపోతాయి. గుమస్తా జన్మ పరమపావనం అవుతుంది. కట్నాల బిల్లు ప్రమేయం ఉండదు. ఆడపిల్లకు ఖర్చుపెట్టిన దానికి రెండింతలు వాడు తెచ్చిపెడతాడు. జీవితం నవచైనాలాగ తయారవుతుంది. అయినా మావాడు కమ్యూనిస్టు కాకూడదు. చదువుకోవాలి. బాగా చదువుకోవాలి. ఏటేటా పాసు కావాలి. ఫస్టుక్లాసు రావాలి, బెస్టుగా తయారవాలి. విజ్ఞానం కోసంకాదు కట్నం కోసం, డబ్బుకోసం.

వాడు పెళ్ళీడుకి వచ్చేసరికి వరకట్నాల బిల్లు వస్తే, దానికి ఆటం బాంబు ఉందిగా? ఫర్వాలేదు. ఇహనుంచి గుండెలమీద చేతులువేసి, హాయిగా నిద్రపోవచ్చును. ప్రావిడెంటుఫండు పెంచనవసరంలేదు. రెండు పూటలూ భోజనం.

ఏడు కొండలవాడా! వడ్డికాసులవాడా!. సంతోషంలో నీమాట మరచిపోలేదు. తప్పకుండా కొండకు వస్తాను. అబ్బాయిని తీసికొనే వస్తాను. నిలువు దోపిడి, తల వెంట్రుకలు సమర్పించుకుంటాను. గోవిందా! గోవిందా!

జేబులో అర్ధణా తీసి వేళ్ళమీదనుంచి పైకి ఎగర వేశాడు. బొమ్మపడితే మగపిల్లవాడు. బొరుసు పడితే ఆడపిల్ల అని మనసులో నిర్ణయించి, క్రింద పడిన అర్ధణా వంక చూశాడు. బొమ్మ పడింది.

"బొమ్మ! మొగపిల్లవాడు!" గట్టిగా అరిచాడు సంతోషం పెల్లుబికి, గోదావరి వరదల్లాగ కట్టలు తెంచుకుంది.

నర్సు నవ్వుతూ తలుపు తీసి

"ఆడపిల్ల" అంది.

---

దీనిభావమేమి? జవాబులు: 1 మొక్కజొన్న కండె. 2 దువ్వెన. 3 ఈత చెట్టు లేక తాటిచెట్టు. 4 కొబ్బరికాయ. 5 చొక్కా. 6 అద్దము. 7 పాముకూసను. 8 పాలపిట్ట లేక శకునపక్షి. 9 ఉత్తరం. 10 దానిమ్మకాయ!